

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 11 పుష్పం : 28-30 20-02-2003

**RAMANA BHASKARA**

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 11

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260


## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 21-1-03 మల్కిపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనమందరము ఈభూమి మీదకు ట్రైనింగ్ పొందటానికి వచ్చాము. మనబుద్ధిలో దోషాలు లేకపోతే మనం ఈ భూమి మీదకు రావలసిన పనిలేదు, మనబుద్ధిలో ఉన్న దోషాలు ఏమిటో శాస్త్రము చెపుతుంది. అందుచేత శాస్త్రాన్ని ఆధారంగా చేసుకొని మనబుద్ధిలో ఉన్న దోషాలు తెలుసుకొని, వాటిలోనుండి విడుదలపొందితే మరల పునర్జన్మరాదు, మరల దుఃఖాలయంలోనికి రానక్కరలేదు. ఈ ప్రపంచంగురించి భగవంతుడు రెండుమాటలు చెప్పాడు. ఇది అశాశ్వతము, దుఃఖాలయం. ప్రపంచంలో ఏదీశాశ్వతంకాదు, ఇదిఅంతా దుఃఖంతోనిండిఉంది, నాయందు భక్తి కలిగిఉండి, నాకిష్టమైన కర్మచేస్తూ, రాగద్వేషాలు తగ్గించుకొంటూ, సత్వగుణాన్ని పెంచుకొంటూ మీరు నాలో ఐక్యంకండి అని భగవంతుడు చెపుతున్నాడు. మనం ఏవస్తువునయితే పొందుదామనుకొంటున్నామో ఆ వస్తువు మనహృదయంలోనే ఉంది. కాని దేహాభిమానం వలన అది ఎక్కడో ఉంది అనుకొంటున్నాము. అది మన హృదయంలోనే ఉంది అన్నసంగతి మనకు గుర్తురావటంలేదు. అది తెలియజేసి, నిన్ను హృదయంలోనికి చేర్చేవాడే గురువు. నన్ను అజ్ఞానంలోనుండి జ్ఞానంలోనికి తీసుకొనిరా, చీకటిలోనుండి వెలుగులోనికి తీసుకొనిరా,

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహాభాషణములు**


21-1-03 మల్కిపురం ........ 1
31-1-03 గుండుగొలను ........ 6
08-2-03 చించినాడ ........ 11




మృత్యువులోనుండి బయటకుతీసుకొనివచ్చి అమృతస్థితిని ప్రసాదించు అని వేదంలో ఒకమాట ఉంది. అజ్ఞానాన్ని విడిచిపెట్టి జ్ఞానంలోనికి రావటానికి మనం అందరం ప్రయత్నం చేస్తున్నాము. మనం ప్రయత్నం చేయాలి, కాలం కలిసిరావాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి. ఇవి అన్నీ ఉంటేగాని పనిపూర్తికాదు. ఈశ్వరానుగ్రహం లేకుండా మనవలన ఏమీ అవ్వదు, మనవలన ఏదో అవుతుంది అనుకొంటే అది మన అజ్ఞానానికి గుర్తు. హర్రీ, వర్రీ అండ్ కర్రీ ఈ మూడు తగ్గించుకోమని పెద్దలు చెపుతారు. కొంతమంది ప్రతీచిన్న విషయానికి కంగారు పడతారు. ట్రైనువచ్చే టైముకు స్టేషన్‌కు వెళ్లినా ఆరైలు వస్తుందో రాదో అని వర్రీ అవుతూఉంటారు. కర్రీ తగ్గించటం అంటే నూనెఎక్కువ వేసిన కూరలు, మషాలా వేసిన కూరలు తినవద్దు. ఇది అందరికీ కాదు, సాధకులు మాత్రం హర్రీ, వర్రీ తగ్గించుకోండి కర్రీ దగ్గర జాగ్రత్తగా ఉండండి. ఉద్రేకంగా మాట్లాడవద్దు. మీరు ఉద్రేకంగా మాట్లాడుతూ ఉంటే మీ స్వరూపానికి దూరమవుతారు. అందుచేత రేష్‌స్పీచ్‌వద్దు. మిమ్మల్ని ఎవరైనా పొగుడుతూఉంటే అది నిజం అనుకోవద్దు. మీవల్ల ఏదైనా పనిఉంటే అలాపొగుడుతూ ఉంటారు, అదినిజం అనుకంటే బోల్తాపడతారు. మనందరం గృహస్తులంఅనుకొంటున్నాము. సన్యాసం అంటే ఏమీలేదు. తనకోసం తనే ప్రార్థించుకొనేవాడు గృహస్థుడు, ఇతరులకోసం కూడా ప్రార్థించేవాడు సన్యాసి, నీవు ఇతరులక్షేమం కోరుతూ ఉంటే, వారు బాగుపడాలని కోరుకుంటూ ఉంటే, నీ అభివృద్ధిని నీవు ఎలా కోరుకొంటున్నావో అలాగ ఇతరుల అభివృద్ధినికూడా కోరుతూ ఉంటే నీవు గృహస్థాశ్రమంలో ఉన్నా సన్యాసి తోటిసమానము. నువ్వు పనిచెయ్యి, పనిచెయ్యగానీకు వచ్చిన ఆదాయంలో కుటుంబానికి కొంత ఉపయోగించుకొంటూ, సమాజానికి కూడా కొంత ఉపయోగించు, సామాజిక స్పృహకలిగిఉండు, జ్ఞానసముపార్జనకోసం మనం ప్రయత్నం చేస్తున్నాము. కాని జ్ఞానం కలగకపోవటానికి మన రాగద్వేషములే కారణం. రాగద్వేషములవలన మనస్సు బాహ్యాముఖానికి పోతుంది. రాగద్వేషములు పెరుగుతూ ఉంటే మోహం పెరుగుతుంది. మోహంపెరిగితే జననమరణప్రవాహంలో కొట్టుకొనిపోతావు, ఇంక దానికి ముగింపుఉండదు. చాలామంది కష్టపడి సంపాదిస్తున్నారు. కాని ఇంటిదగ్గర పిల్లలు ఏమి చేస్తున్నారు, వారి స్నేహాలు, వాళ్ళ అలవాట్లు, పద్ధతులు ఎలాఉన్నాయి అని వారికి అక్కరలేదు. మనం సంపాదించి ఇచ్చింది నిలబెట్టుకొనే సమర్థత, వివేకం ఉన్నాయాఅని చూడటంలేదు. కొంతమంది అయితే పిల్లలు ఎలాఉన్నా మార్కులు మాత్రం నూటికి నూరు వస్తే చాలు, ఎంతసేపు మార్కుల గొడవే. ఏదిమంచిది, ఏదిచెడ్డది అనే విచక్షణ లేకపోతే ఎన్ని మార్కులు వచ్చినా ఏమీప్రయోజనం లేదు, చదువు, ధనం మంచిదే. ఆచదువు, ధనం వాడు

బాగుపడటానికి ఉపయోగపడాలి, కుటుంబం బాగుపడటానికి ఉపయోగపడాలి, సమాజానికి ఉపయోగపడాలి, అప్పుడు ఈశ్వరునిదయకు పాత్రుడవుతాడు.

మనకు శరీరము, మనస్సు, లోకం తెలుస్తున్నాయి. మనహృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఈ మూడింటిని ఉపయోగించుకో, వాటి ప్రయోజనం అంతవరకే. విద్యవలన కీర్తి వస్తుంది, విద్యవలన ధనం వస్తుంది. విద్యవలన అన్నీ తెచ్చిపెడుతుంది. ఇవిఅన్నీ సెకండరీ కాని విద్యవలన నీవు శీలం సంపాదించుకోవాలి. మనకు సహనం తగ్గిపోతోంది. సహనం లేకపోతే హృదయం యొక్క లోతులు పెరగవు మన కుటుంబంలో 10మంది ఉంటారు, వారి మనస్సులు రకరకాలుగా ఉంటాయి. వాటిని సమన్వయం చేసుకొంటూ మనం జీవించాలి. ఎవరితో సహవాసం చేస్తే మన ఆలోచనపెరుగుతుందో, మనహృదయం యొక్క లోతులు పెరుగుతాయో అటువంటి వారితో సహవాసం చెయ్యాలి. మీకు జ్ఞానం వస్తుందా రాదా అని సందేహంవద్దు, తప్పక జ్ఞానం వస్తుంది. మీకు ఉన్న వాసనలవలన, తలంపుల వలన, అలవాట్లవలన జ్ఞానం రాదేమో అనిపిస్తుంది. మీకు ఏదైనా కారణంవలన అశాంతి వచ్చింది అనుకోండి, కుటుంబంలో ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి, మనస్సులో ఇబ్బంది పడుతున్నారు అనుకోండి మనకు జ్ఞానం రాదేమో అనుకొంటారు మీకు తప్పక జ్ఞానం వస్తుంది, జ్ఞానం కలిగే అర్హత మీకు లేకపోతే ఇక్కడకు రావాలనే సంకల్పం కూడా రాదు. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు, పనిచేస్తున్నాడు, అయితే మనలాగ గొప్పలకోసం పనిచేయటం లేదు, మనలను వికారరహితస్థితికి తీసుకొనివెళ్ళటానికి ప్రయత్నంచేస్తున్నాడు. మనలో ఏవికారములు ఉన్నాయో మనకు తెలియదు కాని భగవంతుడికి తెలుసు. ఆ వికారములను కెలుకుతాడు. అప్పడు కూడా మీకు అర్ధంకాకపోతే మీ అత్తగారిచేత తిట్టిస్తాడు. మాటను సహించేశక్తినీకు ఎంత ఉందో చూడటానికి ఎవరో ఒకరిచేత తిట్టిస్తాడు, నోరుమంచిది కానివారిని భగంతుడు ఉపయోగించుకొంటాడు, వారిని అందుకే పెట్టాడు. మనహృదయంలో ఉన్న వికారములను కెలికినపుడు మనకు ఎంతో కొంత పెయిన్ ఉంటుంది, మరల ఆ పెయిన్ భరించే శక్తిని కూడా ఆయనే ఇస్తాడు. భరించే శక్తిని ఇచ్చి ఆవికారములను కెలికి వాటిని తొలగించి మనహృదయాన్ని శుద్ధిచేసి, ఆయన తోటి సమానంచేసి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, వాడే భగవంతుడు.

భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. ఆయనను గుర్తించే యోగ్యత మనకు లేక అక్కడలేడు అనుకొంటున్నాము. మనకు వివేకంలేదు, బుద్ధిసూక్ష్మత లేదు. అన్నంతింటూ శరీరాన్ని పెంచుతున్నాము, బంధువులు, స్నేహితులు పెరుగుతున్నారు, అన్నీ పెరుగుతున్నాయి





కాని వివేకం పెరగటంలేదు. శరీరంలో గ్రోత్ ఉంది, బంధువులలో గ్రోత్ఉంది, స్నేహితులలో గ్రోత్ఉంది కాని జ్ఞానంలో గ్రోత్లేదు. మన తెలివితేటల వలన కామక్రోధములనుండి బయటపడలేము. భగవంతుడి పాదాలను ఆశ్రయిస్తే భగవంతుని నామాన్ని స్మరిస్తూ ఉంటే, భగవంతుడి రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే, భగవంతుడివైభవాన్ని గుర్తిస్తూ ఉంటే మనలో ఉన్న కామక్రోధములను జయించటానికి తగినశక్తిని భగవంతుడు ప్రసాదిస్తాడు. మనం ఏ శరీరంలో ఉన్నప్పడు ఆశరీరం ఒక్కటే నిజం అనిపిస్తుంది. ఆశరీరం ఎటువంటిది అయినా ఇది ఎంత బాగుంది అనుకొంటాము, దేహవాసన అంత బలీయమైనది. మనకు జ్ఞానం కలుగకుండా ఎవరో ఇతరులు అడ్డురావటంలేదు. ఇప్పడు ఏదైతే మనకు నేనుగా వ్యక్తమవుతోందో, ఆనేను అనే తలంపే మనకు అడ్డువస్తోంది, ఇది తెలియటానికి కూడా మనకు కొన్నివేల జన్మలు పట్టవచ్చు. మనం సాధనచేసి తొలగించుకోవలసింది కూడా ఆనేనునే. అనే సాధన విషయంలో వాయిదాలు వేయవద్దు. దేహంతో తాదాప్యం పొందే ఈ నేనును తొలగించుకోవాలంటే పుణ్యబలం ఉండాలి, గుణసంపద ఉండాలి, మనలను ఎవరైనా చిన్నమాట అంటే మనకు వికారం వచ్చేస్తుంది. కాని రామచంద్రమూర్తిని అరణ్యవాసానికి వెళ్ళమని చెప్పిన వార్త విన్నప్పడు కూడా ఆయన మొఖంలో వికారం రాలేదు, అందుకే ఆయన దేవుడు అయ్యాడు. దేహబుద్ధి తగ్గించుకోవడానికి గుణసంపద అవసరం. గుణసంపద వచ్చాక నిన్ను అక్కడ నిలబెట్టడు, నిర్గుణస్థితికి తీసుకొని వెళ్తాడు. పుట్టలోనుండి పాము వచ్చినట్లు నీహృదయంలోనుండి నేను అనే తలంపు వస్తోంది. ఈనేను ఎవరు అని దానిని ప్రశ్నించు. దాని మీద నిఘా ఉంచు. పుట్ట దగ్గర కాపలా ఉంటే దానికి ఆహారం అందక కొన్ని రోజులకు పాము చనిపోతుంది. అలాగే ఈ నేను అనే తలంపును విచారణచేయటంవలన, దానిమీద నిఘా ఉంచటం వలన ఆనేను ఉదయించకుండా చూడటం వలన దానికి ఆహారం అందక అది నశిస్తుంది. భగవంతుడి శక్తి గురించి, ఆయన గొప్పతనం గురించి, జ్ఞానం గురించి మనకు తెలియకపోవటం వలన ఆయన పాదాల మీద మనకు భక్తికుదరటంలేదు. ఆయన పాదాలయందు భక్తికుదిరితే గాని మాయ మనకు దారి ఇవ్వదు. ఎవరి మార్గంలో వారు ప్రయాణం చేయండి, అనుకరణవద్దు. మీరు చేసే ప్రయత్నంలో చిత్తశుద్ధి ఉండాలి, కపటం పనికిరాదు. ఈ మార్గంలో మనం గమ్యానికి చేరగలము అని ఆమార్గంమీద నమ్మకంతో, ఆత్మవిశ్వాసంతో ప్రయాణంచేయాలి. మీ మార్గం నచ్చలేదు అని అందరూ మిమ్మల్ని వదిలేస్తారు అనుకోండి, మీరు మాత్రం ఒంటరిగా ప్రయాణంచెయ్యండి. వారికి నచ్చలేదు అని మీరు ఆ మార్గం విడిచిపెడితే మీరు స్వతంత్రులు కారు. స్వతంత్రుడు కానివాడికి జ్ఞానం రాదు. ఆమార్గంమీకు సుఖంగా

ఉన్నప్పుడు అందులో శాంతి వస్తూ ఉంటే ఆ మార్గంలో ప్రయాణం చెయ్యండి. మీకు ఇష్టులు ఎవరైనా, ఏదైనా ఆటంకాలు కలిగించినా వాటిని గెంటి, ముందుకు వెళ్ళిపోండి. మీ సంసారంలో ఏవైనా ఇబ్బందులు వచ్చినా కంగారుపడవద్దు, వాటికి పూర్వజన్మలకి సంబంధం ఉంటుంది, వాటిని అనుభవిస్తే పోతాయి. మనకు రెండు విద్యలు ఉన్నాయి, ఒకటి పారమార్థికం, రెండవది వ్యవహారికం, ఈ రెండుఅవసరమే మనం మోక్షం పొందటానికి పారమార్థికం, ఇతరుల చేత మోసపడకుండా చూసుకోవటానికి వ్యవహారిక జ్ఞానం. మనం ఇతరులను మోసంచేయకూడదు, ఇతరులయొక్క మోసంలో పడకూడదు. మనం సత్వగుణాన్ని అలవాటు చేసుకొంటున్నాము అనుకోండి, లోపలశాంతిని పెంచుకొంటున్నాము అనుకోండి మనకుటుంబంలోగాని, బయటగాని పరిస్థితులు వ్యతిరేఖంగా ఉన్నా కాలక్షేపంచేసి బయటకు వెళ్ళిపోవచ్చు, లోపలశాంతి ఉంటే అందులోనుండి ఆశక్తినీకు వస్తుంది. లోపలశాంతిని కాపాడుకొంటే బయట నుండి వచ్చే వత్తిడులను, కుటుంబపరంగా వచ్చే వత్తిడులను, సమాజపరంగా వచ్చే వత్తిడులను తట్టుకొనేశక్తి మనకు వస్తుంది.

కోరిక ఒక తలంపు, కోపం ఒక తలంపు, చావు ఒక తలంపు, పుట్టుక ఒక తలంపు జీవితంలో అన్నీ తలంపులే. నీకు ఎన్నితలంపులు వస్తూఉన్నా కంగారుపడవద్దు, ఈ తలంపులు ఎంతకాలం అయితే వస్తూ ఉంటాయో అంతకాలం నేను ఎవడను అనే ప్రశ్నను విడిచిపెట్టవద్దు. అది ఈ తలంపులన్నింటిని నాశనంచేసి చివరకు ఆతలంపు కూడానశిస్తుంది, అప్పుడు నిజమైననేను నీకు తానుగా వ్యక్తమవుతుంది. నీకు ఏదైనా కష్టాలు వస్తూఉంటే కష్టాన్ని కష్టంగా చూడటం మానివెయ్యి, నీదృష్టి మార్చుకొంటే కష్టం కష్టంగా కనబడదు, నీ దృష్టిలో ఉన్న దోషాన్ని తీసివెయ్యి, భక్తుడికి భగవంతుడి యొక్క రూపాన్ని చూస్తూఉంటే ఒక్క కళ్ళేకాదు అన్నీ ఇంద్రియాలు ఆనందంలో తొనికిసలాడతాయి. భక్తుడు కానివాడికి అది రాయి కాని భక్తుడికి ఆరూపాన్ని చూసేటప్పటికి అన్ని ఇంద్రియాలు చల్లబడిపోతాయి, అన్ని ఇంద్రియాలకు ఆనందం వచ్చేస్తుంది. ఎవరైనా విమర్శిస్తే మీకు దుఃఖం వస్తుంది, అది ఒక ఫీలింగ్. ఎవరైనా స్తోత్రం చేస్తే మీకు సంతోషం వస్తుంది, అది ఒక ఫీలింగ్. ఈఫీలింగ్‌లే మనకొంపముంచుతున్నాయి. వీటిని వదిలివేస్తే మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. సత్యాన్వేషణ ఒక్కటే ప్రధానం కాని మిగతా ఫీలింగ్స్ ఏమీ పట్టించుకోవద్దు. ఈశరీరం మరణించకముందే మనబుద్ధిలో ఉన్న దోషాలను శేషంలేకుండా తొలగించుకోవాలి. ఆ తొలగించుకొనే శక్తిని ఇమ్మని మనం పరమేశ్వరుని ప్రార్థించాలి. మనం ప్రార్థించవలసింది అదే. అదే మొదటి ప్రార్థన, అదే చివరి ప్రార్థన.

20-02-2003



ఎందుచేతనంటే శరీరం మరణించే లోపు బుద్ధిలో ఉన్నదోషాలు తొలగించుకోకపోతే మరల కొత్త శరీరాలు వచ్చేస్తాయి. జీవులు రకరకాలుగా ఉంటారు, జీవులందరు మోక్షాన్ని అడగరు ధర్మ అర్థ కామ మోక్షములను అడుగుతారు అందుచేత ధర్మాన్ని ఆచరించే బుద్ధిని ఇమ్మని అడిగేవారికి ఒకచెయ్యి, పైసాలు కావాలి అని అడిగే వారికి ఒకచెయ్యి, కోరికలు అడిగే వారికి ఒకచెయ్యి, ఇవి ఏమీ మాకు వద్దు మాకు మోక్షమే కావాలి అని అడిగే వారికి ఒక చెయ్యి ఇలాగ భగవంతుడు నాలుగుచేతులు పెట్టుకొన్నాడు. జీవులందరూ మోక్షాన్ని అడిగితే ఒక చెయ్యి సరిపోతుంది. మనలను ఎవరైనా ఆదరించేవారు ఉంటే మంచిదే కాని వారు మరణిస్తే ఆదరించే వారు మనకు కనబడరు అందుచేత మనం భగవంతుడి మీద ఆధారపడటం మంచిది. ఎందుచేతనంటే ఆచేతులకు చావులేదు. మనం ఆధార పడవలసిన చేతులు అవే. మీరు ఇతరులను అనుకరించవద్దు. మీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యండి, జ్ఞానగంగ మీ హృదయంలోనే ఉంది. మీరు లోపలకు వెళితే అది దొరుకుతుంది. వస్తువు ఎక్కడ ఉందో అక్కడ వెతకండి, అది మీకు దొరుకుతుంది.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 31-1-03, గుండుగొలను

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం సత్వగుణాన్ని పోషించుకొంటే మన హృదయంలో ఉన్న భగవంతుడికి దగ్గరవుతాము. మనం రజోగుణంలో, తమోగుణంలో ఉంటే ప్రపంచానికి దగ్గరవుతాము. మీరు ఎన్నిగంటలు జపంచేసినా, ధ్యానంచేసినా మీరు రజోగుణం తగ్గించుకోకపోతే, తమోగుణం తగ్గించుకోకపోతే భగవంతుడికి దూరమవుతారు. మన చేతులు పనిమీద ఉండాలి, మనస్సు శాంతిలో ఉండాలి. దానివలన ఏకాగ్రత పెరుగుతుంది, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పనియందు శ్రద్ధ పెరుగుతుంది. గురువు ఎలా ఉంటాడు అంటే ఇక్కడ భగవాన్ చెపుతున్నారు. వాడు శాంతిలో ఊగిసలాడుతూ ఉంటాడు. అది లౌకికమైన శాంతి కాదు. అది అలౌకికమైన శాంతి, అభౌతికమైన శాంతి. అది ఈ లోకానికి, ఈ భూమికి సంబంధించిన శాంతికాదు. కొంతమంది ఈ భూమి మీద ఉన్నా వారు భూమికి సంబంధించిన మనుషులు కాదు. వారే జ్ఞానులు. వారు మనలాగే తింటూ ఉంటారు, తిరుగుతూ ఉంటారు కాని వారు భూమికి సంబంధించిన మనుషులు కాదు. ఎందుచేతనంటే ఈ శరీరం భూమిలో కలిసిపోయినా మనం ఉంటాము అన్న సంగతి వారికి తెలుస్తూ ఉంటుంది. నిప్పుకి వేడి ఎంత సహజంగా ఉంటుందో వారికి శాంతి, దయ, ఓర్పు ఇవి అన్నీ అంత సహజంగా ఉంటాయి. ఈ సృష్టిలో ఉన్న దుఃఖం అంతా

రమణ భాస్కర

వచ్చిన వాడిలో చలనం ఉండదు. అది జ్ఞాని యొక్క వైభవం. మన స్వరూపం శాంతి అయినప్పటికీ మన మనస్సు కల్పించిన రాగద్వేషముల వలన మనకు అశాంతి వస్తోంది. రాగద్వేషములు తగ్గుతూఉంటే శాంతి పెరుగుతుంది. భగవాన్ చెపుతూ ఉండేవారు, ఈ శరీరం పుట్టినప్పడు నువ్వు పుట్టలేదు. ఈ శరీరం పుట్టినప్పడు నీవు పట్టలేదు కాబట్టి ఈ శరీరం చనిపోయినప్పడు నువ్వు చనిపోవు. భగవాన్ చెప్పిన ఈ వాక్యాన్ని మనం నిరంతరం జ్ఞాపకం పెట్టుకోవాలి. మీ ఫోటో తీసుకొంటాము అని ఎవరైనా భగవాన్‌ను అడిగితే మీకు చేతనయితే తీసుకోండి అనేవారు. భగవాన్ అంటే ఎవరు? బ్రహ్మం. బ్రహ్మాన్ని ఎలా ఫోటో తీయగలరు. ఒక రూపం ఉంటే ఫోటో తీయవచ్చు కాని రూపం లేని దానిని ఎలా ఫోటో తీస్తారు. శరీరం పుట్టటం నిజం కాదు, శరీరం చనిపోవటం నిజం కాదు. ఇవి అన్నీ దొంగపుట్టకలు, దొంగ చావులు. శరీరం పుట్టినప్పడు నీవు పట్టలేదు. నేను అనే తలంపు పుట్టినప్పడు నీవు పుట్టావు. ఈ శరీరం చనిపోయినప్పడు నీవు చనిపోవు. నీవు చనిపోయాను అనుకొంటున్నావు, అది దొంగచావు. నేను అనే తలంపు ఎక్కడయితే పుట్టిందో అక్కడకు వెళ్ళి లయమయిపోతే అది నశిస్తుంది, అది నిజమైనచావు. ఈ దేహం చనిపోయిన తరువాత తిరిగి దేహం ఎవడికయితే రాదో వాడు నిజంగా చనిపోయినట్లు, అలాకాకుండా మరల ఇంకొక దేహం వస్తుంది అనుకోండి ఆ చావు నిజంకాదు. మిమ్మల్ని శాంతి సింహాసనం మీద కూర్చోపెట్టటం కోసమే ఈ ప్రవచనాలు అంతకంటే వేరే ప్రయోజనం ఏమీలేదు. మనస్సుకు విశేషాలు ఉన్నాయి. మనస్సుకు గుణాలు ఉన్నాయి కాని చైతన్యానికి విశేషాలు లేవు, గుణాలు లేవు. ఆ చైతన్యంతోటి తాదాప్యం పొందుతూ ఉంటే నీకు అశాంతి పత్తాలేకుండా పోతుంది. మీ తమ్ముడు అంటే మీకు ఇష్టమా అని భగవాన్‌ను అడిగితే అందరూ అంటే ఎలా ఇష్టమో మా తమ్ముడు అంటే కూడా అలాగే ఇష్టం అన్నారు అంటే అందరిలోను అతడూ ఒకడు. గురువు యొక్క వైభవం నోటితో చదవటం వలన, వినటం వలన తెలియదు నీ స్వరూపం నీకు తెలిసినప్పడు గురువు యొక్క వైభవం నీకు తెలుస్తుంది. ఎందుచేతనంటే నిజమైనగురువు నీ స్వరూపంగానే ఉన్నాడు. ఎప్పడు మీకు ఎఱుకపడాలి, ఎప్పడు మీకు శాశ్వతశాంతిని కలుగజేయాలి అని భగవంతుడు చూస్తున్నాడు. మీరు తొందరపడవద్దు, మోక్షం ఇస్తాడు, ఇంకా ఇవ్వలేదు ఏమిటి అని ఆయనను తొందరపెట్టవద్దు. ఇవాళ చేను ఊడ్చి, రేపు కోసేయాలి అంటే ఎలాగ, దానికి కొంత టైము పడుతుంది. అదే విధంగా మోక్షం కూడా మీకు ఎప్పడు ఇవ్వాలో ఆయన ఇస్తాడు, తొందరపడవద్దు. నీకు సత్యాన్వేషణబుద్ధి కలుగజేయటంకోసం నీకు కష్టాలు పంపుతాడు అంతేగాని నీ మీద ఇష్టంలేక కాదు. పిల్లలను మనం ఎప్పడైనా బయపెడతాము. భయపెట్టినప్పడు సడన్‌గా



వచ్చి మనలను కౌగిలించుకుంటారు. ఆయనలో ఐక్యం చేసుకోవటానికే భగవంతుడు కష్టాలు పంపుతున్నాడు. అవి నిజంగా కష్టాలు కాకపోయినా ఆయనను కౌగిలించుకోవటానికి వాటిని కష్టాలులాగ కనిపింపచేస్తాడు, వాడే ఈశ్వరుడు. గురువు నాకు చెప్పేది ఏమిటి, అని గురువుఅంటే ఇష్టం లేక గురువును విడచిపెట్టేస్తారు అనుకోండి, వాడు ఏమి చేస్తాడు అంటే మీకు తెలివిని ఇచ్చి, వివేకాన్ని ఇచ్చి మీ తెలివిచేత, వివేకంచేతమీకు పాఠాలు చెప్పిస్తాడు అంతే గాని మిమ్మల్ని విడిచిపెట్టడు, వాడు గురువు. మీరుఏమనుకుంటారు మన తెలివి వలననే మనకి తెలుస్తోంది, మనం పెద్దవాళ్ళం అయిపోయాము అనుకొంటారు. కాని ఆ తెలివిని ఇచ్చినవాడు గురువే. నేను మిమ్మల్ని కోరేది ఒక్కటే. మీ మీద విశ్వాసం మీరు ఎప్పడూ పోగొట్టుకోవద్దు. మీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు, ఆయన రక్షణలో మీరు ఉన్నారు. భగవంతుడి అస్తిత్వం మీద మీరు ఎప్పడూ సందేహపడవద్దు. దేహంఏపనిమీద వచ్చిందో ఆపని చేసుకొని వెళ్ళిపోతుంది, దానితో తాదాప్యం వదిలెయ్యి, అదినీవు కాదు కదా అంటారు భగవాన్. డబ్బుకు విలువలేదు, డబ్బునాకు కావాలి అనే తలంపు వలన దానికి విలువ వస్తోంది. అలాగే పదవికి విలువలేదు ఆపదవి నాకు కావాలి అనే తలంపు దానికి విలువనిస్తోంది. మనం ఆత్మలోనే ఉన్నాము. మనం ఏమీ అనుకోకుండా ఉంటే ఆత్మలోనే ఉంటాము. ధ్యానం చెయ్యి మంచిదే, కాని ధ్యానం చేసేటప్పడు కూడా నిన్ను నీవు విడిచిపెట్టి కొంతదూరం వెళ్ళిపోతున్నావు, నిన్ను నీవు పరిశీలించుకోవటం లేదు. ఏతలంపుకు ధ్యానం చేయాలని ఉందో ఆ తలంపును పట్టుకొని దాని మూలంలోనికి వెళ్ళు. నీ నిజమైన ఇల్లు అక్కడే ఉంది, చావులేనిస్థితి అక్కడే ఉంది, నిజం అక్కడే ఉంది. అక్కడికి వెళితే ఆనిజమే నీకు నేనుగా వ్యక్తమవుతుంది. మనం ఏదైనా మంచిపనిచేస్తే, ఎవరికైనా ఏదైనా ఇస్తే అది చేసి మర్చిపోతే అది మనలను బంధించదు, అది మర్చిపోకపోతే మనలను బంధిస్తుంది. సాధనచేసి ఏదో సాధించాలి అనుకోనేది మనమే, అది సాధించాను, ఇది చేసాను అని కల్పించుకోనేది మనమే. పిల్లలకు ఒక చేత్తో అన్నం పెట్టి, ఇంకో చేత్తో నెత్తిమీద మొట్టి అన్నం కక్కిస్తున్నారు అనుకోండి అది ఎలా ఉంటుందో మనం చేసే పనులు కూడా అలాగే ఉన్నాయి. అక్కడ సాధన చేసి మనస్సును చంపటానికి ప్రయత్నం చేస్తున్నావు, ఇక్కడ అది చేసాను, ఇదిచేసాను అని మనస్సును పెంచుకొంటున్నావు. ఇంక ఎక్కడికి వెళతావు, గానుగెద్దులాగ ఉంది మన జీవితం. తెల్లవారుజామున గంగానదిలో స్నానంచేయటం, చలిభరించలేక హేరామా, హేకృష్ణా అనటం. అది మీరు భక్తితో అంటున్నారా, చలిభరించలేక అంటున్నారా అది కూడా లోపలఉన్న ఈశ్వరుడు చూస్తూఉంటాడు. మేము సాధన బాగా చేస్తున్నాము అని మీకు

ఏదైనా తలంపు వచ్చింది అనుకోండి, ఆ తలంపుతో తాదాప్యం పొందవద్దు. ఏదో తింగర తలంపు వచ్చింది, ఆ తలంపుతోటి ఊరేగటం ఎందుకు అని అనుకొని ఆతలంపును వదులుకోండి, అదేసాధన, తలంపు వస్తే రానివ్వండి. దానితో మీరు జతకట్టకండి. జతకట్టకపోతే అదే పోతుంది. మేముతెల్లవారుజామున చన్నీళ్లు స్నానం చేస్తున్నాము అని అంటే మీరు చేయలేని పనిని మేము చేస్తున్నాము అని చెప్పటం, అంటే అహంభావన అక్కడ సూక్ష్మరూపంలో ఉంది. హిమాలయాలలో వేసవి కాలంలో స్నానం చేస్తేనే చలిగా ఉంటుంది. అక్కడ స్వాములు కొంతమంది స్నానం చేస్తూ పెడబొబ్బలు పెడుతూఉంటారు అంటే దేహభావన ఎక్కువ ఉంది అని అర్థం. ఈ దేహం నిజంకాదు అనే భావన వారికి కలిగినప్పడు చలిబాధ అంత ఉండదు, దానిని భరించగలుగుతారు. నాకు దేవుడు అంటే ఇష్టం ఉండదు, నాకు ధర్మం అంటే ఇష్టం నాన్నగారు అని ఒకరు చెపుతున్నారు. దేవుడికి మరోపేరే ధర్మం అని చెప్పాను. ధర్మం అంటే దానం అని కాదు, అదిఒక జీవితవిధానం. ధర్మానికి వేరుగా భగవంతుడు లేడు, భగవంతుడు ధర్మస్వరూపుడు, నా గురువు ఎవరు అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నేనే నీగురువు అని చెపుతారు అని అతను అనుకొన్నాడు, ఆయన ఎందుకు అలా చెపుతాడు, అసలు సృష్టేలేని వాడికి గురువు శిష్యుడు ఏమిటి. ఎవరి సమక్షంలో ఉన్నప్పడు నీ ప్రయత్నంతో సంబంధంలేకుండా ఆటోమేటిక్‌గా సాధన జరుగుతూ ఉంటుందో, ఎవరి సమక్షంలో ఉన్నప్పడు నీ మాటలు, తలంపులు ఆగిపోతాయో ఆయనే నీగురువు అని చెప్పారు. మంచితనం కూడా సామాన్యంకాదు ఎంతో కష్టపడితేగాని మంచితనం రాదు. మంచితనం లేకపోతే జ్ఞానం ఎలా వస్తుంది. నీ హృదయంలో ఎంతో కొంత మంచితనం లేకపోతే సృష్టిలో ఉన్న సౌదర్యం నీకు గోచరంకాదు. అదే భగవాన్ చెపుతూ ఉంటారు. నీకు అర్హత లేనప్పడు, లోపల ప్రిపరేషన్ లేనప్పడు కళ్ళుఉన్నా చూడలేరు చెవులున్నా వినలేరు. గాంధీగారు మహాత్ముడు అవ్వటానికి ఒకటే కారణం ప్రతివాడికి వాడి ప్రాణం అంటే చాలా ఇష్టం కాని ఒకమంచిపని కోసం ఆయన ప్రాణాన్ని గడ్డిపరకలాగ విడిచి పెట్టటానికి ఎప్పడూ సిద్ధంగా ఉన్నాడు, వాడు గాంధీ. నేను మోక్షం పొందాలంటే కృషి ఒక్కటే సరిపోతుందా, గురుకృప ఉండాలాఅని ఒకరు అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీకు మోక్షం పొందాలి అనే తలంపు కలుగచేసినవాడు కూడా గురువే, మోక్షం పొందాలి అనే తలంపు నీకు రావటంకూడా అది గురుకృపవలననే వచ్చింది. గురుకృప లేకపోతే నీకు ముముక్షత్వంరాదు. నీకు అమృతత్వం కలిగాక తెలుస్తుంది. నీవు చేసింది తక్కువ, గురువు యిచ్చింది ఎక్కువ అని, అంతా గురువే. భగవాన్ నాకు స్వప్న దర్శనం ఇచ్చి నన్ను ముద్దుపెట్టుకొంటూఉంటే నాకు సంతోషం కలుగలేదు, భయంకలిగింది.

**20-02-2003**

నన్ను విడిచిపెట్టేయి అంటున్నాను, విడిచిపెట్టేసమస్యేలేదు అని ఆయన అంటున్నాడు. అది ఏనాటి అనుబంధమో చెప్పలేము. ఆయన పేరు ఎప్పడూ నేను వినలేదు, ఎవరైనా గురువులు చెపుతూ ఉంటే కూడా వినలేదు, కావాలని తెచ్చుకోలేదు. పైగా తెంచుకోవాలంటే తెంపుకొనే బంధంకాదు. ఆసంకెళ్ళు తెంచుకోవాలంటే అవికనబడితే తెంపుకోవచ్చు అసలు కనబడకుండా ఉంటే ఎలా తెంచుకోగలము. ఈ శరీరం మరణించినా రాబోయే జన్మలో కూడా గురువు నిన్ను విడిచిపెట్టడు. వీడు ఎక్కడ ఉన్నాడు, ఎక్కడ శరీరం ధరించాడు అని వెంటాడుతాడు. ఆయన మీద ప్రేమ కలిగేటట్లు కూడా ఆయనే చూసుకొంటాడు, మన అహంకారం ఏమిప్రేమిస్తుంది గురువు యొక్క దయ మహాప్రవాహంలాంటిది. అది ఈ రూపంలోనుండి, ఈ నామంలోనుండి మనలను విడుదలచేసి జ్ఞానంలో ఐక్యం చేస్తుంది, వాడే గురువు. నీవు ఏదైనా చెడుస్నేహాలలో ఉన్నావు అనుకో, ఆ బేడ్‌కంపెనీ వలన నీవు ఎక్కడికి పోతావో గురువుకు తెలుసు అందువలన ఆ బేడ్‌కంపెనీలో నుండి నిన్ను విడుదలచేయటానికి ప్రయత్నంచేస్తాడు, వాడు గురువు. నిన్న ఎవరో ఫోన్‌చేసి మా కుటుంబపరిస్థితులు బాగాలేవు, బాగాలేకపోయినా ఫరవాలేదు వాటిని తట్టుకొనే శక్తిని ఇవ్వండి అని అడుగుతున్నారు. అప్పడు నేను చెప్పాను. ఈశ్వరుడు చేసేపని అదేఅని చెప్పాను. మీదయచూపించండి అని గురువును అడుగనక్కరలేదు, గురువు దయాస్వరూపుడు ఎంతోకొంత అభ్యాసం చేస్తున్నాను, బాగా చేస్తున్నాను అని చెప్పలేను అని అంటున్నాడు. నువ్వేదో చేస్తున్నాను అనుకొంటున్నావు. అభ్యాసం చేయించే వాడు గురువే, అభ్యాసం కూడా గురువే, అంతా గురువే, గురువు యొక్క దయలేకపోతే నీకు అసలు అభ్యాసం చేయాలనే తలంపుకూడా రాదు. నీవు అభ్యాసం చేయగా చేయగా అవసరమయితే నీలోపలఉన్న ఆత్మే నీకోసం కాళ్ళుచేతులు తొడుక్కొని వస్తుంది, వాడే గురువు. .నీతో మాట్లాడుతూ, నీతో కలిసి తిరుగుతూ ఈ జీవుడిని హృదయగుహలోనికి నెట్టేస్తాడు, నీకు తెలియకుండా పనిజరిగిపోతుంది. నీ దయ కావాలి అని భగవంతుడిని అడగనక్కరలేదు, అది గుర్తించటానికి నీకు అర్హత ఉండాలి. నీవు గుర్తించినప్పడు దయవుంది, నీవు గుర్తించనప్పడు కూడా దయవుంది, గుర్తిస్తే అది నీకు తెలుస్తుంది. గుర్తించకపోతే తెలియదు కాని దయ ఎప్పడూ ఉండనే ఉంది, అదిలేని క్షణం అంటూలేదు. గురువు రూపం ఉన్నప్పడూ రూపం లేనివాడే, ఒకనామం ఉన్నప్పడూ నామంలేనివాడే అది గుర్తించిన వాడు ధన్యుడు.

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీనాన్న గారి అనుగ్రహభాషణములు, 8-2-03, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

కొంతమంది శరీరాలు చనిపోయినా వారుచేసిన మంచిపనుల వలన మానవజాతి హృదయాలలో అలా జీవించి ఉంటారు. కొంతమంది జీవించి ఉంటారు, వారి శరీరాలు ఇక్కడే ఉంటాయి కాని ఎవరి హృదయంలోను వారికి స్థానం ఉండదు. జ్ఞానాన్ని ప్రేమను సమన్వయం చేసుకొని జీవించాలి. మనహృదయంలో ఒక సద్వస్తువు ఉంది, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఈ జ్ఞానయజ్ఞాలు, సజ్జనసాంగత్యం వీటి యొక్క ప్రయోజనం అదే. జీవితగమ్యాన్ని సాధించటానికి పెంకితనం ఉండకూడదు కాని పట్టుదల ఉండాలి. పెంకితనం వేరు, పట్టుదల వేరు. పట్టుదలఎంత మంచిదో, పెంకితనం అంతచెడ్డది పట్టుదలకుగుర్తు అబ్రహంలింకన్. గొప్ప ఆత్మవిశ్వాసం ఉన్న వ్యక్తి లింకన్. చిన్నప్పడు వ్యాపారంచేస్తే నష్టం వచ్చింది, ఎలక్షన్‌లలో చాలాసార్లు ఓడిపోయాడు. మనం మంచి చేయటానికి ప్రారంభించినపుడు చెడు ఎదురయినా మంచిని విడిచిపెట్టకూడదు. ప్రజలు ఆయనను ఎన్ని సార్లు ఓడించినా ఆయనకు ప్రజలమీద ప్రేమతగ్గలేదు. జరిగేది మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మనడ్యూటీ విషయంలో అంటే మనం చేసే పని విషయంలో అశ్రద్దచేస్తే జీవితంలో ఓడిపోతాము అని లింకన్ చెప్పాడు. అనేక ఓటమిలు చవిచూసి, జీవితంలో అనేక అనుభవాలు పొంది చివరకు అమెరికా ప్రెసిడెంటు అయ్యాడు. జీవితంలో ఆత్మవిశ్వాసం ఉండాలి ఆత్మవిశ్వాసం లేకపోతే, ధైర్యంలేకపోతే జీవితంలో ఓడిపోతాము. మనకు సహనంలేకపోతే సాత్వికప్రవృత్తి రాదు. సాత్వికప్రవృత్తి లేనివాడు శాంతిగాఉండలేడు, సమాజానికి ఆనందాన్ని ఇవ్వలేడు. సాత్వికప్రవృత్తి ఉన్నవాడు మాత్రమే తాను శాంతిగా ఉంటాడు, ఇతరులకు శాంతిని పంచిపెడతాడు. సాత్వికప్రవృత్తిని మనం ప్రాక్టీసు చెయ్యాలి. తమోగుణం, రజోగుణం, సత్యగుణం ఈ మూడుగుణాలను దాటితే కదా ఈశ్వరసాక్షత్కారం అయ్యేది అని చెపుతారు. కాని మనం సత్వగుణాన్ని విడిచిపెట్టకూడదు. ఎందుచేతనంటే సత్వగుణం ద్వారా మూడుగుణాలను దాటగలము. మనం మనస్సును కాదు పొడిగించుకోవలసింది, సత్వగుణాన్ని పొడిగించుకోవాలి. మనస్సుకు శాంతికావాలంటే ఏ హృదయంలో అయితే భగవంతుడు ఉన్నాడో అక్కడకు నీ మనస్సు ప్రయాణం చేస్తూ ఉంటే దానికి శాంతి దొరుకుతుంది, విశ్రాంతి దొరుకుతుంది. మనకు గమ్యంమీద ఎంత ప్రీతి ఉందో, ఆగమ్యానికి చేరటానికి మనం చేసే ప్రయత్నం మీద కూడా అంత ప్రీతి ఉండాలి, ప్రేమ ఉండాలి, భక్తి ఉండాలి లేకపోతే గమ్యాన్ని మిస్ అయిపోతాము. సర్వదుఃఖాలనుండి మానవుడు విడుదల పొందాలంటే అవి



కుటుంబంద్వారా వచ్చినా, సమాజం ద్వారా వచ్చినా, ప్రకృతి ద్వారా వచ్చినా అది ఏరకమైన దుఃఖంఅయినా వాటిలోనుండి విడుదల పొందాలంటే ఒక్కటే ఉపాయం, ఆత్మజ్ఞానాన్ని సముపార్జించాలి. ఇంకోమార్గంలేదు ఆత్మజ్ఞానాన్ని సముపార్జించిన వాడు మాత్రమే సర్వదుః ఖాలనుండి విడుదలపొందుతాడు.

సత్యవస్తువు నీహృదయంలో ఉంది. నీ మనస్సులో ఉన్న తలంపులను, గుణాలను ఆలోచనలను, తింగరతనాన్ని తీసుకొనివెళ్ళి లోపలఉన్న వస్తువుకు రుద్దవద్దు. లోపలఉన్న సత్యవస్తువు గురించి ఊహించవద్దు. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అది నీకు అనుభవంలోనికి రాకపోతే వదిలెయ్యి అంతేగాని నీతింగరతనాన్ని దానికి రుద్దుకు. నీకు తెలియకపోతే తెలియనట్లు పడిఉండు అంతే గాని నీవికారములను, రాగద్వేషములను, నీ సంకల్పవికల్పాలను తీసుకొనివెళ్ళి సద్వస్తువుకు రుద్దకు. వేదంలో చెపుతారు మనం నిరంతరం స్మరించదగినది, ధ్యానించదగినది, స్తోత్రం చేయదగినది హృదయంలోఉన్న పరమాత్మ ఒక్కటి మాత్రమే. అది రూపరహితం. నామరహితం అది తప్పించి దేనిని స్మరించినా పరిణామంలో నీకు దుఃఖంవస్తుంది. ప్రతీరోజూ మనం అభ్యాసం చేయాలి, ఏరోజు కారోజు మనం సజీవంగా ఉండాలి, ప్రతీరోజును మనం సద్వినియోగం చేసుకోవాలి. నీవు స్వచ్ఛంగా అవ్వాలంటే ఈశ్వరుడు ఎక్కడున్నాడు నీ హృదయంలో ఉన్నాడు, నీమనస్సు ఆయన సమీపంలో ఉంటే నీవు స్వచ్ఛంఅయిపోతావు. నీలో బలహీనతలు ఉన్నా అవి రాలిపోతాయి. ఆయన సాన్నిధ్యంలో ఉన్నప్పడు నీవు భయరహితుడుగా ఉంటావు, నిర్మలంగా ఉంటావు, ప్రకృతిలో ఉన్న ఆటుపోటులు నిన్ను చలింపచేయలేవు. మహాత్ములతోటి, సత్పురుషులతోటి సాంగత్యం చేస్తూఉంటే నీమనస్సులో ఉన్న దోషాలు పోయి అది నిర్మలం అయ్యి గంతులు వేసుకొంటూ, ఉరకలు వేసుకొంటూ నదీప్రవాహంలాగ వేగంగా హృదయంలోనికి పరుగెడుతుంది. మీరు గెంటనక్కరలేదు. మహాత్ముల సాంగత్యంవలన మనస్సు స్వచ్ఛం అయి సంతోషంగా, ఆనందంగా హృదయంలోనికి వెళ్ళి ఐక్యమవుతుంది. ఆ ప్రయాణంలో దానికి ఆటంకాలు వచ్చినా ఒక్క గంతువేసి వాటిని అతిక్రమించి హృదయంవైపుకు వెళ్ళిపోతుంది. మనస్సుకు సత్వగుణంవచ్చి నపుడు అది వేగంగా హృదయంవైపు ప్రయాణంచేస్తుంది అందువలన సత్వగుణాన్ని కాపాడుకో, దానిని పెంచుకో, దానిని పోషించుకో. హృదయంలోనుండి మనస్సు సహస్రారానికి వచ్చినప్పడు దేహంతో తాదాప్యం వస్తోంది. అని అడిగితే వస్తుంది అది సంభవమే అంటున్నారు భగవాన్. అభ్యాసం వలన ఆతాదాప్యం క్రమేపి తగ్గిపోతుంది. మరల హృదయంలోనికి మనస్సును పంపటంవలన దేహంతో తాదాప్యం పోతుంది. జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి,

అనేకరకాల మనుషులు తారసపడతారు. అసంఘటనల ద్వారా, మనుషులద్వారా మనం పాఠాలు నేర్చుకొంటూ అక్కడ ఆగిపోకుండా ముందుకు ప్రయాణం చెయ్యాలి.

మనకు ఎప్పుడైనా అశాంతి వస్తుంటే భగవంతుడు మనలను విడిచిపెట్టేసాడా అని మనకు అనిపిస్తుంది. మనకు శాంతివస్తే భగవంతుడు మనలను స్మరించుకొంటున్నాడు లేకపోనా ఇంత శాంతి మనకు ఎలా వస్తుంది అనిపిస్తుంది. భగవంతుడు మనలను ఆయన వడిలోనికి తీసుకొంటే శాంతి, తీసుకోకపోతే అశాంతి మీరు ఎప్పుడైనా ఆనందంలో ఊగిసలాడుతూ ఉంటే భగవంతుడు మనలను తీసుకొన్నాడు, ఆయన అనుగ్రహం మనమీద పనిచేస్తోంది అని అర్థం లేకపోతే అంత అలౌకికమైన శాంతి మనకు దొరకదు. మీకు ఎప్పుడైనా అనుభవాలు వస్తూ ఉంటాయి. కాని అవి నిలబడవు. ఆత్మానుభవం శాశ్వతం అవ్వాలంటే వాసనలు వేరుతో సహానశించాలి కొంతమందికి సాధన ప్రారంభించిన వెంటనే వాసనలు నశిస్తాయి. కొంతమందికి ఎంత సాధనా చేసినా వాసనలు నశించవు అంటే భగవంతుడికి ఒకరిమీద ఇష్టం, ఒకరి మీద అయిష్టంఅనికాదు, పూర్వజన్మలో ఎవరైతే సాధనచేసి ఈజన్మ లోనికి వచ్చారో వారికి అతి తొందరగా వాసనానాశనం అవుతుంది. వారు మనకు ఆప్తులు, వీరు మనకు ఆప్తులు అని అనుకొంటాము కాని భగవంతుడిని మించిన ఆప్తుడు మనకు లేడు, గురువును మించిన ఆప్తుడు లేడు మనకు భగవంతుడిని మించిన ఆప్తుడు ఈసృష్టిలో ఎవడూలేడు అందుచేత భగవంతుడు ఒక మాట చెపితే దానిని ఆప్తవాక్యం అంటారు ఎవరైతే మనక్షేమంకోరుతున్నారో వారు చెప్పిన మాటను తీసివేయకూడదు, దానికి గౌరవం ఇవ్వాలి సాధనాబలం లేనివారు, పుణ్యబలం లేనివారు అది గుర్తించలేరు. భగవంతుడు చెప్పిన మాటల గురించి మనకు తెలియనప్పుడు మనకు అర్థంకావటం లేదు అనుకోవాలి అంతేగాని ఆమాటలు అసత్యం అనుకోకూడదు. ఎంతోకొంత సాధన చేస్తున్నాను, సాధనలో అభివృద్ధి అవుతున్నట్లు నాకు ఎలా తెలుస్తుంది అని అడుగుతున్నారు. మీ అభివృద్ధిని మీరు కొలుచుకోవటం కష్టం, నీలో రాగద్వేషములు తగ్గాలి, తలంపులవేగం తగ్గాలి, సంకల్పవికల్పాలు తగ్గుతూ ఉండాలి అప్పుడు నీవు అభివృద్ధి చెందుతున్నట్లు లెక్క, మనం అదిసాధించాము, ఇది సాధించాము అనుకొంటాము చేయించినవాడు ఈశ్వరుడే, మనం ఇలా అనుకోవటం వలన మనస్సు పాడిగింపబడుతుంది. మనవల్ల ఏదైనా మంచిపని అయ్యింది అనుకోండి ఈ దేహాన్ని ఈశ్వరుడు ఉపయోగించుకొన్నాడు, చేసేది ఈశ్వరుడే, ఒక్కో సంఘటన నీకు ఇష్టం ఉంటుంది, ఒక్కో సంఘటన నీకు ఇష్టం ఉండదు. ఇవి అన్నీ భగవంతుడిలోనే జరుగుతున్నాయి, అని నీకు తెలిస్తే దుఃఖంచల్లారిపోతుంది. వివేకంలేనివారు,





ఆలోచనలేనివారు, తెలివితక్కువవారు విషయాల నుండి ఆనందంపొందటానికి ఎలా ప్రయత్నం చేస్తారో వివేకవంతులు, తెలివిగలవారు ఆత్మనుండి ఆనందం పొందటానికి అలా ప్రయత్నం చేస్తారు అని ప్రహ్లాదుడు చెప్పాడు. వివేకహీనుడికి విషయాలమీద ఎంతప్రీతి ఉంటుందో వివేకవంతుడికి సద్వస్తువు మీద అంతప్రీతి ఉంటుంది, దానిని పొందాలనే కాంక్ష అంత ఉంటుంది. ఇది వివేకవంతుడి లక్షణం, అది వివేకహీనుడి లక్షణం స్వార్థరహితుడికి, భయరహితుడికి, ద్వేషరహితుడికి మాత్రమే ఆత్మానందం అందుతుంది. జ్ఞానసంపదలేనివారిని, వినయసంపదలేని వారిని లోకం గుర్తించిన ప్రభువు గుర్తించడు. గౌరవము, పేరుప్రతిష్టలు ఇవిఅన్నీ లోకం ఎంతనిజమో, నీ మనస్సు ఎంతనిజమో అవి కూడా అంతేనిజం, ప్రభువు దృష్టిలో వాటికి అర్థంలేదు మనం ఏదైనా ఒకమాట మాట్లాడుతున్నాము అనుకోండి, ఏదైనా ఒక రచన చేసాము అనుకోండి అందులో సందేశం ఉండాలి. మనకు వినేవారి పట్ల, చదివేవారిపట్ల ప్రేమ ఉండాలి, ఆప్యాయత ఉండాలి, లేకపోతే అటువంటి ప్రసంగాలు అనవసరం, అటువంటి రచనలు అనవసరం. నీ మాటద్వారా గాని, చేత ద్వారాగాని మనస్సును పాడిగించుకోకూడదు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటం వలన మనస్సు పాడిగింపబడుతుంది, దేహమేఆత్మ అనే భావన బలపడుతుంది. నీకు ఎన్ని కష్టాలు వచ్చినా కంగారుపడవద్దు. ఈ కష్టాలు ఎవరికి వస్తున్నాయి అనే ప్రశ్న వేసుకో. నీ దృక్పదం మార్చుకొంటే కష్టంలేదు, కష్టం సుఖంగా మారిపోతుంది. మనం ఏదీ నెగిటివ్‌గా చెప్పకూడదు. పాజిటివ్‌గా చెప్పటం వలన మన చైతన్యస్థాయి పెరుగుతుంది, సమస్య పరిష్కారం అవుతుంది, నేను ఎవడను అనే ప్రశ్న ఎందుకు అంటే నేనుఎవడను అనే ప్రశ్నలో ఒక నేను ఉంది, ఆ నేనును తొలగించుకోవటానికే నేనుఎవడను అనే ప్రశ్న.

చటోపాధ్యాయ ఒక పిడత గురించి వ్రాసారు. పిడత అంటోంది నేను మట్టిని, నన్ను కాల్చి పిడత క్రింద చేసారు. నాకు ఒక రూపం వచ్చింది. నన్ను అందరూ పిడత, పిడత అంటున్నారు అంటే నాకు ఒక నామం వచ్చింది. పిడతగా ఉండటం నాకు ఇష్టంలేదు. పిడత చాలా బాగుంది అని అందరూఅంటున్నారు కాని సుఖంలేనప్పుడు అందరూ బాగుంది అంటే మాత్రం నాకు ఎందుకు. నేను మట్టిగా అయ్యేవరకు నాకు సుఖంలేదు, ఆనందంలేదు అంటోంది పిడత. ఇక్కడ ఒక విషయం గ్రహించాలి. అది పిడతగా ఉన్నప్పుడు కూడా అది మట్టిగానే ఉంది. కాని దానికి మట్టితో తాదాప్యం లేదు. ఆ రూపంతో తాదాప్యం ఉంది, పిడత అనే పేరుతో తాదాప్యం ఉంది. ఆ రూపనామములు ఉన్నప్పుడు కూడా అది మట్టిగానే ఉంది. మట్టిలేకపోతే పిడతలేదు. అది పిడత అనే రూపంగా, నామంగా ఉన్నప్పుడు కూడా

మట్టితో తాదాప్యం పొందుతూ ఉంటే ఈ నామరూపములు దానిని బంధించవు. అలాగే మనం కూడా ఈ నామరూపములలో ఉన్నప్పటికి వీటికి ఆధారముగా ఉన్న బ్రహ్మముతో తాదాప్యం పొందుతూ ఉంటే ఈ నామరూపములు మనలను బంధించవు. నేను మట్టిలో ఎప్పడు కలిసిపోతాను, నేను ఎక్కడనుండి వచ్చానో అక్కడకు వెళ్లేవరకు నాకు సుఖంలేదు, శాంతి లేదు అని పిడత అంటున్నప్పటికి అలా అనేటప్పడు కూడా అది మట్టిలోనే ఉంది. మట్టిలో ఉండి మట్టికి వేరుగా ఉన్నాను అనుకొంటోంది. మనం కూడా అంతే బ్రహ్మంలో ఉండి బ్రహ్మంకు వేరుగా ఉన్నాము అనుకొంటున్నాము. ఈ తలంపువలన లక్షలాదిజన్మలు సఫరింగ్‌కు గురి అవుతున్నాము. ఆ వేరుభావన, భిన్నభావన వలన, ఆ చిన్నతలంపువలన కొన్నివేల తలంపులు వచ్చేస్తున్నాయి. పిడత మట్టిలో ఉండి మట్టి కంటే వేరుగా ఉన్నాను అనుకొంటోంది. అలాగే మనం కూడా బ్రహ్మంలో ఉండి బ్రహ్మంకు వేరుగా ఉన్నాము అనుకొంటున్నాము. మనం బ్రహ్మంకు భిన్నంగా లేము, భిన్నంగా ఉన్నాము అనే తలంపును ఆధారం చేసుకొని అనేక తలంపులు వచ్చి లక్షలాది జన్మలకు గురి అవుతున్నాము. సజ్జన సాంగత్యం వలన, ధ్యానం వలన ఇది తెలుస్తుంది. ఎక్కడయితే రూపం ఉందో అక్కడ దుఃఖం వెంటాడుతుంది. అందుకే ఆ పిడతకు దుఃఖం విడిచిపెట్టటంలేదు. పిడత బాగుంది అని మీరు అంటున్నారు కాని నాగోల, నా అశాంతి మీకు తెలియటంలేదు. నేను ఇలా ఉండను, మట్టిని అయిపోతాను, మట్టిగా ఉన్నప్పడే బాగున్నాను, నన్ను కాల్చి పిడత క్రింద తయారు చేసారు, అప్పటినుండి అశాంతి ప్రారంభమయ్యింది అంటోంది పిడత. లక్షపిడతలు ఉన్నా అవి మట్టికంటే వేరుగా లేవు. అలాగే ఎన్నికోట్ల జనాభా ఉన్నా కూడా వారు భగవంతుడికి భిన్నంగా లేరు, భిన్నంగా లేరు కాబట్టి నువ్వు అందరిలోను భగవంతుడినే చూడు. భగవంతుడిలో ఐక్యం అవ్వటానికి అదొక మార్గం. ఎక్కడ నుండి వచ్చానో అక్కడకు వెళ్లేవరకు నాకు శాంతి లేదు అంటోంది పిడత. ఎక్కడ నుండి వచ్చిందోఅది అక్కడే ఉంది కాని దానికి ఒక రూపం వచ్చింది, నామం వచ్చింది అంతే తేడా. పిడత మట్టిగా నిజం. రూపంగా నామంగా అబద్ధం. మనం కూడా బ్రహ్మంగా నిజం. రూపంగా, నామంగా అబద్ధం. ఈ తేడా తెలిస్తే ఇప్పడు కూడా మనం బ్రహ్మంగానే ఉన్నాము అని తెలుస్తుంది. అయితే మనం బ్రహ్మంగా ఉంటే ఎందుకు అశాంతి వస్తోంది? బ్రహ్మంకు భిన్నంగా ఉన్నాము అనుకోవటంవలన అశాంతి వస్తోంది. మట్టికి భిన్నంగా ఉన్నాను అని పిడత ఎలా అనుకొంటోందో అలాగే మనం కూడా బ్రహ్మంకు భిన్నంగా ఉన్నాము అని అనుకొంటున్నాము. ఆ చిన్నతలంపువలన అనేకవేల తలంపులు వచ్చి అజ్ఞానంలో, అశాంతిలో కూరుకొనిపోతున్నాము. పిడతా, పిడతా ఎంత అందంగా ఉన్నావు, ఎంత ఎర్రగా ఉన్నావు

4A

అని మీరు అంటున్నారు కాని మట్టిగా ఉన్నప్పడు ఉన్న ఆనందం ఇప్పడు నాకు రావటం లేదు అంటోంది పిడత. ఎందుచేత రావటంలేదో చెప్పండి. అది ఇప్పడు కూడా మట్టిగానే ఉంది కాని దానికి మట్టితో తాదాప్యం పోయింది. రూపంతోటి, నామంతోటి తాదాప్యం వచ్చేసింది. ఎంత తాదాప్యం వచ్చేసింది అంటే మట్టిలో ఉన్నాను అన్నసంగతి కూడా మర్చిపోయింది. ఎక్కువ కాల్చేసి నాకు రంగు కల్పించారు. కల్పితంలోనుండి ఆనందం రాదు, శాంతి రాదు, ఎక్కువగా దానిని కాల్చినా, దానికి మంచి రంగు వచ్చినా దానికి మట్టితో తాదాప్యం ఉంటే అప్పడు కూడా ఇబ్బంది లేదు. కాని దానికి రంగుతోటి, నామంతోటి తాదాప్యం వచ్చేసింది. సహజంగా అది మట్టే. కాని నేను మట్టిని కాదు, పిడతను అని వేరుభావన వచ్చేసింది. అందువలన మట్టిలో ఉన్నప్పటికి దుఃఖం అనుభవిస్తోంది. పిడతగా ఉన్నప్పడు కూడా అది మట్టిలోనే ఉంది. అది ఏమట్టిగా ఉందో దానితో తాదాప్యం లేదు అందువలన దానికి ఆనందం అందటం లేదు. మన పరిస్థితి కూడా అంతే. జీవుడికి ఈశ్వరుడికి ఎంతదూరం ఉంది అంటే పిడతకు మట్టికి ఎంతదూరం ఉందో, సినిమా తెరకు బొమ్మకు ఎంతదూరం ఉందో జీవుడికిఈశ్వరుడికి అంతే దూరం ఉంది. జీవుడు ఎక్కడ ఉన్నాడు. ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు? ఇద్దరూ ఒకేచోట ఉన్నారు. పిడత మట్టిలో ఉన్నప్పటికి దాని తలంపులు, ఆలోచనలు, సంకల్పవికల్పాలు దానిని మట్టికి దూరం చేస్తున్నాయి. నేను మట్టికి దూరమయిపోయాను అనుకొనేది కూడా తలంపే. అదే అశాంతిని తీసుకొని వస్తోంది. ఏ తలంపు అయితే అశాంతిని తీసుకొని వస్తోందో దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు. నేను మట్టిలో కలవాలి అనుకొనేటప్పడు కూడా పిడత మట్టిలోనే ఉంది. మనం కూడా బ్రహ్మంలో ఐక్యం అవ్వాలి అనుకొంటున్నాము కదా మరి ఇప్పడు ఎక్కడ ఉన్నాము బ్రహ్మంలోనే ఉన్నాము. పిడతను బలవంతంగా ముక్కలు చేయనక్కరలేదు. అది పిడతగా ఉన్నప్పడే దానికి ఉన్న రంగుతోటి, రూపంతోటి తాదాప్యం మానివేస్తే అది మట్టిగానే ఉంటుంది. మనం కూడా అంతే. ఈ శరీరం చనిపోనక్కరలేదు. శరీరం ఉండగానే నామరూపములతో తాదాప్యం వదిలేస్తే మనం కూడా బ్రహ్మంగానే ఉండవచ్చు. మనకు రూపంతోఉన్నతాదాప్యం, నామంతోఉన్న తాదాప్యం విడిచిపెడితే లోపలఉన్న జ్ఞానం తాలుక వైభవం ఇప్పడే, ఈక్షణంలోనే అనుభవంలోనికి వస్తుంది.

20-02-2003

రమణ భాస్కర

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 23,24-2-2003 | ఆది, సోమ | గీతామందిరం |
| 26-02-2003 | బుధవారం | శివదేవుని చిక్కాల |
| 01-03-2003 | శనివారం | చించినాడ శివాలయం (శివరాత్రి) |
| 02-03-2003 | ఆదివారం | యానాం |
| 09-03-2003 | ఆదివారం | పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపం |
| 12-03-2003 | బుధవారం | జిన్నూరు శ్రీ రమణక్షేత్రం |
| 15-03-2003 | శనివారం | ఆత్రేయపురం |

## శ్రవణం, మననం, నిధిధ్యాస

సత్యాన్వేషణ ద్వారా స్వరూపానుభూతిని పొందుటకు మనము చేసే ప్రయత్నంలో శ్రవణ, మనన, నిధిధ్యాసలు లక్ష్యసాధనకు, విజయానికి సోపానాలు.

శ్రవణం : మన స్వరూపమైన ఆత్మ సిద్ధవస్తువు, అనగా కేవలము ఉన్నదే ఆత్మ. అట్టి స్వరూప జ్ఞానాన్ని అందించే వారే గురువు. గురువు వద్ద 'ఆత్మ తత్వాన్ని' శ్రద్ధగా, వినయంగా, ప్రేమ పూర్వకంగా, కపటం లేకుండా శ్రవణం చేయాలి. గురువు బోధించిన విషయాన్ని చక్కగా గ్రహించి, ఆ మాటలలోని రసాన్ని, సారాన్ని అనుభవించాలి. ఆత్మజ్ఞాన సముపార్జనలో అవగాహన ముఖ్యం. ఆ పరమస్థితిని పొందుటకు దేనిని విడిచిపెట్టాలో సరియైన అవగాహన కావాలి. వ్యక్తిభావనను విడిచిపెట్టాలి, ఆత్మగా ఉండాలి.

మననం : గురువు వద్ద శ్రవణం చేసిన విషయాన్ని అనేక పర్యాయాలు తలపెట్టుకోవడం మననం. మననం వలన గురువు యొక్క బోధ మన బుద్ధిలో దృఢమై, స్థిరపడుతుంది. అప్పడు దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. 'సత్సంగము' వలన శ్రవణ, మననములు చక్కగా జరిగి మనస్సుకు దారుఢ్యం వస్తుంది, వివేకం పెరుగుతుంది.

నిధిధ్యాస : నిధి అనగా స్వరూప ఆత్మ; ధ్యాస అనగా స్వరూపము నందు నిష్ఠ కలిగియుండుట. నేతిధార వలె నిరంతరం ఆటంకంలేని స్వరూపచింతనను నిధిధ్యాస అంటారు. నిరంతరము ఆత్మను చింతించుట వలన అదే మనము అవుతాము. సాక్షాత్తుగా ఉన్న ఆత్మను ప్రత్యక్షానుభవం ద్వారా గ్రహిస్తాము. అప్పడు అజ్ఞానదృష్టి నష్టమై ప్రజ్ఞాదృష్టి లభిస్తుంది.

**చావలి సూర్యనారాయణ మూర్తి**
**టీచర్ - అమలాపురం**

## పాలకొల్లు సరస్వతి శిశుమందిర్‌లో గ్రంథాలయ భవన శంకుస్థాపన



ది॥ 6-2-2003న శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల నందు ఉదయం గం॥ 9-04ని॥లకు గ్రంథాలయము భవన నిర్మాణ నిమిత్తం సద్గురు శ్రీ నాన్నగారిచే శంకుస్థాపన కార్యక్రమము జరుపబడినది. గ్రంథాలయ భవన నిర్మాణ నిమిత్తం డా॥ చుండూరి మల్లిఖార్జున గుప్త గారు లక్ష రూపాయలు విరాళముగా ఇచ్చియున్నారు. ఈ కార్యక్రమములో శ్రీ పెన్మెత్స శ్రీరామరాజు మరియు పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు శ్రీ బుద్దా లక్ష్మీనర్సింహరావు, శ్రీ పెనుగొండ వీరభద్రరావు, శ్రీ బోడా సత్యజిత్ కుమార్, శ్రీ శీలంశెట్టి రంగారావు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం గోదావరి సంభాగ్ అధ్యక్షులు శ్రీ గోడుగులూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

శంఖుస్థాపన కార్యక్రమం అనంతరం వసంత పంచమి సందర్భముగా ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమములో శ్రీ నాన్నగారు చిన్నారులకు అక్షరాభ్యాసము చేయించారు.



ది॥ 6-2-2003 సం॥రం గురువారం ఉ॥ గం॥ 9-30ని॥లకు సద్గురు శ్రీ నాన్నగారి అమృత హస్తాలతో పాలకొల్లు బొండాడ వారి వీధి నందు ఎ.సి.లు, కంప్యూటర్లు గల "సాయిశంకర్ ఏజన్సీస్" ప్రారంభోత్సవం సుభప్రదంగా జరిగినది. శ్రీ అల్లు వెంకటసత్యనారాయణ,M.L.A., గారు వ్యాపార ప్రారంభోత్సవము చేయగా శ్రీ మరిడి ప్రభాకర్ గారు ప్రధమ కొనుగోలు చేసియున్నారు.